క్లుప్తంగా

క్రీడా పరికరాలు అందజేత



క్రీడా పరికరాలు అందజేస్తున్న దృశ్యం

పలాస: పలాస మండలంలోని పాఠశాలలకు క్రీడా పరికరాలు, స్పాట్ కిట్స్, టాయ్‌లెట్ మెటీరియల్‌ను మంగళవారం అందజేశారు. మండల రిసోర్స్ సెంటరు వద్ద ఎంఈవో శ్రీనివాసరావు ఉపాధ్యాయులకు వీటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఆర్పీలు ఉర్నాన అప్పలరాజు, పి.బాలరాజు, మండల విద్యా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఆర్థిక సాయం

ఇచ్ఛాపురం: పట్టణానికి చెందిన స్విమ్మింగ్ క్రీడాకారులకు స్థానిక దాతలు ఆర్థిక సహాయం అందించారు. ఈనెల 11 నుంచి తిరుపతిలో జరగనున్న రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల కోసం పట్టణానికి చెందిన ఏడుగురు విద్యార్థులు మంగళవారం పయనమయ్యారు. ఈ మేరకు వీరికి ప్రయాణ ఖర్చుల నిమిత్తం స్థానిక దాతలు బత్తుల వెంకటరమణ, బత్తిన నాగరాజు, చాట్ల లోహిదాస్, అంజనీకుమార్, నీలాపు శ్రీనులు ఆర్థికసాయం చేశారు.రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్విమ్మింగ్ కోచ్ బత్తు రామారావు, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాస్ పూండి, టి.గణేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

పాతరోడ్డు తొలగింపు ప్రక్రియ ప్రారంభం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో శరవేగంగా జరుగుతున్నటువంటి కేటీరోడ్డు పనుల్లో భాగంగా మంగళవారం పాతరోడ్డు తొలగింపు పనులు ప్రారంభమయ్యాయి. పలాస ఇందిరా జంక్షన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్సు వరకు రెండు వైపులా బీటీ రోడ్డు పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం కాశీబుగ్గలో చేపడుతున్నటువంటి పనుల్లో భాగంగా పాత రోడ్డును జేసీబీలతో తొలగించారు. త్వరలోనే తారుపొరను వేయనున్నట్టు మున్సిపల్ కమిషనర్ నాగేంద్రకుమార్ తెలిపారు.

మొక్కలు నాటడం సామాజిక బాధ్యత

మందస: మొక్కలు నాటడాన్ని సామాజిక బాధ్యతగా తీసుకోవాలని ఎంపీపీ డొక్కరి దానయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు సవర చంద్రమ్మ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, సొండిపూడి, మూలిపాడు సర్పంచ్‌లు చిచ్చుల నళిని, గుసిరి వెంకటరావు అన్నారు. సొండిపూడిలో మంగళవారం గ్రీన్ ఆర్మీ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. అటవీ సంపదను కాపాడుకోవాలన్నారు. గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్, కేఎస్‌పీఎస్ నాయకుడు మిస్క కృష్ణయ్య, ఐఏఎస్ రిటైర్డ్ అధికారి రుంకు అప్పారావు, నగిరి లక్ష్మీనారాయణ, ఇప్పిలి మోహనరావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దడ్డ కిరణ్‌కుమార్, చెరుకుపల్లి లక్ష్మణమూర్తి, గ్రీన్ ఆర్మీ ప్రతినిధులు బోకర దుర్యోధన, ఇప్పిలి శేఖర్, నగిరి విజయ్‌బాబు పాల్గొన్నారు.

బలగకు చాంపియన్స్ కా చేంజ్ అవార్డు ప్రదానం



కర్ణాటక గవర్నర్ తవర్‌చంద్ గెహ్లాట్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న బలగ ప్రకాశ్

టెక్కలి: నందిగాం మండలం బడగాం గ్రామానికి చెందిన సినీ నిర్మాత బలగ ప్రకాశ్‌కు కర్ణాటక ప్రభుత్వం చాంపియన్స్ కా చేంజ్ అవార్డును మంగళవారం ప్రదానం చేసింది. ఈ మేరకు అవార్డు గ్రహీత ప్రకాశ్ మీడియాకు వివరాలు వెల్లడించారు. దేశ వ్యాప్తంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందజేసిన 25 మంది ప్రముఖులను ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. కరోనా సమయంలో విశిష్ట సేవలు అందజేసినందుకు ప్రకాశ్‌కు అవార్డు వరించింది. కర్ణాటక గవర్నర్ తవర్‌చంద్ గెహ్లాట్ చేతుల మీదుగా ఈ అవార్డును అందజేశారు. సుప్రీం కోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి కె.జి.బాలకృష్ణన్ జ్యూరీ చైర్మన్‌గా వ్యవహరిస్తూ అవార్డుల ప్రదానోత్సవాన్ని నిర్వహించారు.

జగనన్న కాలనీ పరిశీలన

సోంపేట: బారువ సచివాలయం-2 పరిధిలో నిర్మిస్తున్న జగనన్న కాలనీని పలాస ఆర్డీవో భరత్‌నాయక్ మంగళవారం పరిశీలించారు. కాలనీ కోసం సేకరించిన స్థలం సముద్రానికి దగ్గరగా ఉండడంతో లబ్ధిదారులు ఆసక్తి చూపించడం లేదని స్థానిక జెడ్పీటీసీ సభ్యురాలు తడక యశోద జిల్లా ఇన్‌చార్జి మంత్రి బొత్స సత్యనారాయణ దృష్టికి ఇటీవల తీసుకెళ్లారు. దీంతో మంత్రి సూచన మేరకు భరత్ నాయక్ పరిశీలించారు. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లనున్నట్టు పేర్కొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

నందిగాం: ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించి వారి మన్ననలు పొందాలని ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి సూచించారు. నౌగాం పీహెచ్‌సీ సలహా మండలి సమావేశం వైద్యాధికారిణి పి.అంజలి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యం, వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్నారన్నారు. పీహెచ్‌సీలో మౌలిక సదుపాయాల కల్పనకు సభ్యులు ఆమోదించారు.

‘ఏపీకి జగనే ఎందుకు కావాలంటే’

విజయవంతం చేయండి

నందిగాం: ఈ నెల తొమ్మిదో తేదీ నుంచి నిర్వహించనున్న వై ఏపీ నీడ్స్ జగన్ అనే కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పంచాయతీ కార్యదర్శులు కృషి చేయాలని ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి కోరారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీవో శివప్రసాద్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రభుత్వం అందజేస్తున్న వివిధ సంక్షేమ పథకాల గురించి పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు తెలియజేయాలన్నారు. ఈవోపీఆర్డీ రాజారావు, చిన్ని జోగారావు, అంబోడి విష్ణు పాల్గొన్నారు.

కంచిలి: ‘ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే’కార్యక్రమాన్ని కంచిలి-1, కంచిలి-2 సచివాలయాల పరిధిలో ఈ నెల 9, 10 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు రెండు సచివాలయాల ఉద్యోగులు, వలంటీర్లతో స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పీఏసీఎస్ అధ్యక్షుడు గుమ్మడి రామదాసు, ఎంపీడీవో చల్లా శ్రీనివాసరెడ్డి, ప్రత్యేక ఆహ్వానితుడు దుర్గాసి ధర్మారావు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.



నందిగాం: మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీరామమూర్తి

కవిటి: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రజలకు జరిగిన మేలును వివరిస్తూ విస్తృతస్థాయిలో ప్రచారం నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కడియాల ప్రకాష్ అన్నారు. కవిటిలో ఆయన అధ్యక్షతన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంపై పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ నెల తొమ్మిదో తేదీ నుంచి ప్రారంభం కానున్న ఈ కార్యక్రమంలో అన్నివర్గాల ప్రజల్ని భాగస్వామ్యం చేయాలన్నారు. తొలుత కవిటి-1 సచివాలయం పరిధిలో మధ్యాహ్నం మూడు గంటలకు కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. పూడి లక్ష్మణరావు, పి.నీలాచలం, వై.నీలయ్య, దువ్వు కృష్ణారెడ్డి, పాండవ శేఖర్, పులకల శ్రీరాములు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని పది సచివాలయాల్లో ఈ నెల 9 నుంచి 23వ తేది వరకూ రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు.

ఇచ్ఛాపురం రూరల్: లబ్ధిపొందుతున్న వారి జాబితా, అభివృద్ధిని ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో ప్రదర్శించాలని ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు అన్నారు. ‘ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి’ అనే కార్యక్రమంపై స్థానిక మండలాభివృద్ధి కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బందితో మంగళవారం ఏర్పాటు చేసిన సదస్సులో అవగాహన కల్పించారు.ఎంఈవో కురమాన అప్పారావు, ఈవోపీఆర్డీ కె.వి.ఎ.సత్యన్నారాయణ, సుగ్గు రవికుమార్ పాల్గొన్నారు.



కంచిలి: మాట్లాడుతున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి



ఇచ్ఛాపురం రూరల్:మాట్లాడుతున్న ఈశ్వరరావు

వలసల నివారణకే ఉపాధి పనులు

ఇచ్ఛాపురం రూరల్: గ్రామాల్లో వలసలను నివారించేందుకు ప్రభుత్వం ఉపాధిహామీ పథకం ద్వారా ప్రజలకు పనులు కల్పిస్తోందని ఎంపీపీ బోర పుష్ప అన్నారు. టి.బరంపురం పంచాయతీ పి.శాసనాంలో మంగళవారం గ్రామ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అర్హులందరికీ జాబ్ కార్డులు మంజూరు చేసి వంద రోజులు పని దినాలు కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఏపీఓ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పంచాయతీ పరిధిలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ సుమారు రూ.48 లక్షలతో 10,661 పని దినాలు ఇచ్చేందుకు ఏకగ్రీవంగా తీర్మానించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా నెలవారీ పనులు వివరాలతో కూడిన సామాజిక చిత్రపటం, సీజనల్ మ్యాప్‌ను ప్రదర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ కారంగి త్రినాథ్, టెక్నికల్ అసిస్టెంట్ ఎల్.సునీల్, సిబ్బంది పాల్గొన్నారు.



పనుల సీజనల్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎంపీపీ పుష్ప

జగన్ మళ్లీ సీఎం కావాలంటూ తిరుపతికి పాదయాత్ర

టెక్కలి: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుతూ ఆకాంక్షిస్తూ టెక్కలి నుంచి తిరుపతి వరకు పాదయాత్ర ప్రారంభిస్తున్నట్లు యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.గురునాథ్ యాదవ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. టెక్కలిలోని తన నివాస గృహం నుంచి బుధవారం బయలుదేరి పట్టణంలోని శ్రీకృష్ణుడు, గోపినాథ, కిల్లిపోలమ్మ, రావివలస ఎండల మల్లికార్జునస్వామి ఆలయాలను దర్శించుకుంటానన్నారు. అనంతరం సంతబొమ్మాళి మండలం మీదుగా కోటబొమ్మాళి చేరుకుని అక్కడ నుంచి జాతీయ రహదారి మీదుగా పాదయాత్ర చేపడతానని గురునాథ్ వెల్లడించారు.

నేరాలకు దూరంగా ఉండాలి

టెక్కలి: విద్యార్థులు నేరాలకు దూరంగా ఉండాలని టెక్కలి ఎస్సై రామకృష్ణ సూచించారు. స్థానిక ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేసుకోవాలన్నారు. ఎన్ఎస్ఎస్ పీవో పి.బలరాం పాల్గొన్నారు.

హరిపురంలో గ్రిగ్స్ పోటీలు

మందస: హరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం గ్రిగ్స్ పోటీలు జరిగాయి. ఖోఖో, వాలీబాల్ పోటీలు సీనియర్, జూనియర్, బాలురు, బాలికలకు వేర్వేరుగా నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ.. క్రీడలు ఆరోగ్యానికి, మానసిక ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. వాలీబాల్‌లో సీనియర్, జూనియర్స్ బాలుర పోటీలో హరిపురం, జీఆర్‌పురం జట్లు, బాలికలు సీనియర్స్‌లో హరిపురం, జీఆర్ పురం జట్లు విజేతలుగా నిలిచాయి. ఖోఖోలో బాలురు సీనియర్స్‌లో కిల్లోయి ఆశ్రమపాఠశాల, కృష్ణాపురం, జూనియర్స్‌లో కృష్ణాపురం, సీనియర్స్ బాలికల్లో కేజీబీవీ (జీఆర్‌పురం), బీఎస్‌పురం, జూనియర్స్‌లో హరిపురం, కేజీబీవీ(జీఆర్‌పురం) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు గెలుపొందారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జగన్నాథపురం పురుషోత్తం, హెచ్ఎం జి.ఉమారాజు, వ్యాయామ ఉపాధ్యాయులు పి.తవిటయ్య, సవర రామారావు, మార్పు ట్రస్టు అధ్యక్షుడు మట్ట ఖగేశ్వరరావు, పీఎంసీ వి.కళ పాల్గొన్నారు.



వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు

బస్సు ఢీకొని ఇద్దరికి గాయాలు



నుజ్జయిన ద్విచక్ర వాహనం



తీవ్రంగా గాయపడిన జగదీశ్వరరావు

మందస: బస్సు ఢీకొని ఇద్దరు గాయపడ్డారు. మందస పట్టణంలోని బస్టాండ్‌లో మంగళవారం జరిగిన ఈ ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. బస్టాండ్ నుంచి పలాస వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు తగిలి.. బస్టాండ్‌కు ద్విచక్రవాహనంపై వస్తున్న బొర్ర జగదీశ్వరరావు, మరో వాహనంలో వస్తున్న వెంకటేశ్‌లు తీవ్ర గాయాలయ్యాయి. ద్విచక్రవాహనం నుజ్జు, నుజ్జు కాగా, జగదీశ్వరరావు, వెంకటేశ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. మందస 108 వాహనంలో హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి క్షతగాత్రులను తరలించారు. వీరిలో జగదీశ్వరరావు పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో హరిపురంలో సీహెచ్‌సీ నుంచి అదే 108 అంబులెన్స్‌లో టెక్కలి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్సకై అక్కడి వైద్యులు శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. ఎస్ఐ సీహెచ్ హరికృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భయపెడుతున్న పులి!

కాశీబుగ్గ/మందస: పలాస, మందస మండలాల ప్రజలను పెద్దపులి భయం వెంటాడుతోంది. ఈ రెండు మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో పులి సంచరిస్తున్నట్టు ప్రజలు చెబుతున్నారు. దీంతో అటవీ అధికారులు చేరుకొని పులి అడుగులుగా భావిస్తున్న వాటిని మంగళవారం పరిశీలించారు. పలాస మండలం అమలకుడియా పంచాయతీ పరిధిలో మంగళవారం పెద్దపులి సంచరించినట్టు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన రైతులు పంటపొలాలకు నీరు కట్టేందుకు వెళ్లగా పులి అడుగులను గుర్తించినట్టు చెబుతున్నారు. దీంతో అమలకుడియా, అమలకుడియాకాలనీ, పూర్ణబద్ర, వీరభద్రాపురం గ్రామాల ప్రజలు భయాందోళన చెంది కాశీబుగ్గ అటవీశాఖ కార్యాలయానికి సమాచారం చేరవేశారు. దీంతో ఫారెస్టు రేంజ్ అధికారి మురళీకృష్ణంనాయుడు సిబ్బందితో వచ్చి పాదముద్రలు గుర్తించి పెద్దపులివేనని స్పష్టం చేశారు. రాత్రి సమయంలో ఇదే మండలం మోదుగులపుట్టి, టెక్కలిపట్నం, కొమలాపురం గ్రామాల మీదుగా కొండపైకి వెళ్లే అవకాశం ఉందని.. వెనుదిరిగితే వజ్రపుకొత్తూరు మండలం అనంతగిరి పంచాయతీ పరిసర ప్రాంతాలలో ఉన్నటువంటి తోటలు, కొండలు, గెడ్డలుమీదుగా జాతీయ రహదారి వైపు వచ్చే అవకాశం ఉందని ఫారెస్టు అధికారులు చెప్పారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అమలకుడియా పంచాయతీ సర్పంచ్ కొర్ల శిరీషా, నాయకులు మురళీకృష్ణల ఆధ్వర్యంలో గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఫారెస్టు అధికారులు ఐ.రాము, పి.రాజు, ఆర్.రాజేంద్రరావు, బి.వి.రెడ్డి, టి.వెంకటేశ్వరరావు, ఆర్.సంతోష్‌కుమార్, ఎస్.దుర్గాదేవి, పి.భానుమూర్తి, ఎ.బాబూరావు, యానిమల్ వారియర్స్ ఉన్నారు. పులి కనిపిస్తే సమాచారం ఇవ్వాలని ఫారెస్టు సిబ్బంది కరపత్రాలను పంపిణీ చేశారు.



కాశీబుగ్గ: అమలకుడియాలో ప్రజలతో సమావేశమైన ఫారెస్టు అధికారులు

రైతు భరోసా కింద రూ. 50 కోట్ల లబ్ధి

సోంపేట: మండలంలోని 9 వేల మంది రైతులకు రైతు భరోసా పథకం ద్వారా ఇప్పటి వరకూ రూ. 50 కోట్లు లబ్ధి చేకూరిందని ఎంపీపీ నిమ్మన దాస్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో రైతు భరోసా ఐదో సంవత్సరం రెండో విడత నగదు జమను మంగళవారం జమ చేసిన సందర్భంగా ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని వీక్షించారు. వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి, ఎంపీడీఓ బి.వెంకటరమణ పాల్గొన్నారు.

సమన్వయంతో ఓటర్ దరఖాస్తుల పరిశీలన

- సబ్ కలెక్టర్ నూరుల్ కమార్

టెక్కలి: ఓటర్ల నమోదు ప్రక్రియలో భాగంగా ఇటీవల నిర్వహించిన ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమానికి, వెబ్ సైట్‌లో వచ్చిన దరఖాస్తులను బీఎల్వో, బీఎల్ఏలు సమన్వయంతో పరిశీలన చేయాలని టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమార్ అన్నారు. స్థానిక కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక ఓటర్ల నమోదు ప్రక్రియలో భాగంగా ఫారం-6, 7, 8 దరఖాస్తులను సమన్వయంతో పరిశీలన చేసి ఫైనల్ జాబితాకు సిద్ధం చేయాలన్నారు. ఎక్కడైనా అభ్యంతరాలు ఉంటే తక్షణమే ఆయా కుటుంబ సభ్యుల అభ్యర్థన మేరకు తొలగింపులు చేయాలని సూచించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ, జనసేన, బీజేపీలకు చెందిన నాయకులు బగాది హరి, ఎ.రాహుల్, బి.శేషగిరి, కె.కిరణ్‌కుమార్, వి.వేణుగోపాల్, జి.మీనాబాబు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల నాయకులతో సమీక్షిస్తున్న నూరుల్ కమార్

ఉన్నతాధికారుల దృష్టికి కరువు పరిస్థితులు

సోంపేట: మండలంలో నెలకున్న కరువు పరిస్థితులను జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు, మంత్రుల దృష్టికి తీసుకెళ్లినట్టు ఎంపీపీ నిమ్మన దాస్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో బి.వెంకటరమణ ఆధ్వర్యంలో మండల సాధారణ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజా ప్రతినిధులు మండలంలోని తీవ్ర వర్షాభావ పరిస్థితులను సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. కరువు మండలంగా ప్రకటించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి మాట్లాడుతూ.. ఎనిమిది వేల ఎకరాల్లో వరి నాట్లు వేయడం జరిగిందని, ప్రస్తుతం వర్షాల్లేక పంట ఎండిపోయే పరిస్థితులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఎంపీపీ దాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులకు న్యాయం చేస్తోందన్నారు. పంచాయతీరాజ్ ఈఈ రమేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భవనాల నిర్మాణాల పూర్తికి ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. పలువురు సభ్యులు సమస్యలను ప్రస్తావించారు. మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఐ.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ నిమ్మన దాస్

పల్లెనిద్రకు సమాయత్తం కావాలి

టెక్కలి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న పల్లెనిద్ర కార్యక్రమానికి అంతా సమయాత్తం కావాలని టెక్కలి ఎంపీపీ ఆట్ల సరోజనమ్మ అన్నారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బగాది హరి ఆధ్వర్యంలో మంగళవారం టెక్కలిలో గ్రామ సచివాలయ సిబ్బందితో ముందస్తు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి నేతృత్వంలో నిర్వహించనున్న పల్లెనిద్ర కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని పూర్తి స్థాయిలో వివరించడమే కాకుండా, పల్లెనిద్ర కార్యక్రమం ద్వారా ఆయా గ్రామాల ప్రజల సమస్యలను తెలుసుకోవాలని ఎంపీపీ సరోజనమ్మ కోరారు. మండల పార్టీ అధ్యక్షుడు బగాది హరి మాట్లాడుతూ.. పల్లెనిద్ర కార్యక్రమానికి సంబంధించి పూర్తిస్థాయి విధి విధానాలు త్వరలో వివరిస్తామన్నారు. మాజీ ఎంపీపీ సంపతిరావు రాఘవరావు, సర్పంచ్‌లు జి.మోహన్‌రెడ్డి, ఎం.శంకర్, నాయకులు డి.పోలయ్య, అశోక్, టి.ధర్మారావు, డి.శ్రీను, ఇన్‌చార్జి ఈవో మల్లేశ్వరరావు, గ్రామ సచివాలయం-1 సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సరోజనమ్మ

పారదర్శకంగా జగనన్న సమగ్ర భూసర్వే

కవిటి: రెవెన్యూశాఖలో అపరిష్కృతంగా మిగిలిపోయిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న సమగ్ర భూసర్వే కార్యక్రమం ఎంతో ప్రయోజనకరమైనదని పలాస ఆర్డీవో భరత్‌నాయక్ అన్నారు. డివిజన్‌లో బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా మండలంలో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా మండలస్థాయి అధికారులతో సమగ్రభూసర్వేలో 21 రెవెన్యూ గ్రామాలకు గాను పది గ్రామాల్లో భూసర్వే చేపట్టినట్టు తెలిపారు. ప్రస్తుతం వీటిలో రెండు చోట్ల వెక్టరైజేషన్ ప్రక్రియ నిర్వహిస్తున్నట్టు అధికారులు ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. ఇందులో లోటుపాట్లను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ముసాయిదా ఓటరు జాబితాపై వచ్చిన అభ్యంతరాలు, సవరణలపై ఆరాతీశారు. అనంతరం పలు రెవెన్యూ అంశాలపై శాఖాపరమైన సమీక్ష నిర్వహించారు. తహసీల్దార్ పి.శేఖర్ ఉన్నారు.



సిబ్బందితో సమావేశమైన ఆర్డీవో భరత్‌నాయక్

సంక్షిప్తంగా...

సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యంలో రక్తదానం

కోటబొమ్మాళి: సత్యసాయి 98వ జయంతిని పురస్కరించుకుని స్థానిక సత్యసాయి సేవామందిరంలో ట్రస్టు సభ్యుల ఆధ్వర్యంలో బుధవారం రక్తదానం శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 52 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కాల్ల సంజీవరావు, రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధి చైతన్య, సత్యసాయి ట్రస్టు జిల్లా కన్వీనర్ లింగరాజు, సభ్యులు సకలాభక్తుల రాజశేఖర్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీ సందర్శన

కోటబొమ్మాళి: ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఫ్యామిలీ డాక్టర్ జిల్లా నోడల్ అధికారి ఎం.ప్రసాదరావు అన్నారు. తిలారు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరాతీశారు. వైద్యులు మూల అమృత, మెండ మణీషా, హెల్త్ సూపర్‌వైజర్ నర్సింగరావు ఉన్నారు.

ఆశ్రమ పాఠశాలలో గణిత అవధానం

కంచిలి: నువాగడలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో గణిత అవధాన ప్రక్రియను గణిత అవధాని మడ్డు తిరుపతిరావు మంగళవారం నిర్వహించారు. గణిత శాస్త్రంలోని చిట్కాలను నేర్చుకుంటే ఎటువంటి సమస్యలను కూడా సులభంగా పరిష్కరించవచ్చునని వివరించారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దుర్గాప్రసాద్ పాడి పాల్గొన్నారు.

నియోనేటల్ వాహనంపై అవగాహన

టెక్కలి: అప్పుడే పుట్టిన చిన్నారులకు తక్షణమే మెరుగైన వైద్యం అందజేయడానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న నియోనేటల్ 108 వాహనంపై ప్రతి గ్రామంలో విస్తృతంగా అవగాహన కల్పించాలని కె.కొత్తూరు పీహెచ్‌సీ సీహెచ్‌వో జ్యోతి సూచించారు. స్థానిక పీహెచ్‌సీలో మండలంలోని ఆరోగ్య, ఆశ వర్కర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. సిబ్బంది సింహాచలం, ఆదినారాయణ పాల్గొన్నారు.

గ్యాస్ కనెక్షన్ కోసం డబ్బులు వసూలు చేస్తే చర్యలు

టెక్కలి: కేంద్ర ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న ఉజ్వల గ్యాస్ కనెక్షన్ల కోసం ఏజెన్సీలు డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సివిల్ సప్లై డీటీ మురళీకృష్ణ హెచ్చరించారు. ఉజ్వల గ్యాస్ కనెక్షన్‌లను లబ్ధిదారులకు అందజేయడానికి స్థానిక అన్నెపు గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు అధికారుల దృష్టికి వెళ్లడంతో మంగళవారం ఆయా కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు ఇచ్చిన గ్యాస్ కనెక్షన్ల వివరాలను సేకరించారు. సుమారు 450 మంది లబ్ధిదారుల నుంచి అక్రమంగా రూ. 600 చొప్పున వసూలు చేస్తున్నట్లు అధికారుల దృష్టికి వెళ్లడంపై ఏజెన్సీ ప్రభుత్వ సిబ్బందిపై మండిపడ్డారు. మరోసారి ఇటువంటి ఫిర్యాదులు వస్తే తక్షణమే కార్యాలయాన్ని సీజ్ చేస్తామని డీటీ హెచ్చరించారు.

వ్యవసాయ రంగాన్ని ఆదుకోవాలి

పలాస: వ్యవసాయ రంగాన్ని ప్రభుత్వాలు ఆదుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఎ.ఐ.కె.ఎం.ఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిపాటి వెంకటేశ్వర్లు కోరారు. బొడ్డపాడు జిల్లా అమరవీరుల స్మారక భవనం వద్ద మంగళవారం రైతుకూలీ సంఘం జిల్లా పదో మహాసభలు మంగళవారం జరిగాయి. ముందుగా జిల్లా అమరవీరుల స్థూపం వద్ద నుంచి ర్యాలీ నిర్వహించారు. మర్రిపాడు, మామిడిపల్లి , బొడ్డపాడు గ్రామాల్లో అమరవీరులకు జోహార్లు అర్పిస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు, మన్యం జిల్లా అధ్యక్షుడు వెలగాడి కృష్ణ, జిల్లా నాయకులు మామిడి భీమారావు, బైరి కూర్మారావు, జుత్తు వీరాస్వామి, బదకల ఈశ్వరమ్మ, రామారావు, సోమేశ్వరరావు, పి.దానేసు, పుచ్చ దుర్యోధన, ఎం.రామారావు పాల్గొన్నారు.

ఒడియా పాఠశాలలో నాడు-నేడు పనులు

కాశీబుగ్గ: రాష్ట్రంలో ఉన్నటువంటి ఒడియా పాఠశాలలకు సైతం తెలుగు పాఠశాలలతో సమానంగా ప్రాధాన్యం ఇచ్చి అభివృద్ధి చేస్తుండడంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని ఒడియా సంఘ పెద్దలు అన్నారు. కాశీబుగ్గలోని ఒడియా ప్రాథమిక పాఠశాలలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో వక్తలు మాట్లాడారు. కాశీబుగ్గ ఒడియా పాఠశాలకు నాడు-నేడు పథకంలో భాగంగా రూ.11 లక్షలు మంజూరు అభివృద్ధి చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఒడియా భాషాభివృద్ధి నిమిత్తం చిన్నారులకు ఒడియా భాషా పుస్తకాలను పంపిణీ చేశారు. ఒడియా మైనారిటీ అధ్యక్షుడు సత్యంనారాయణ పాడి, 11వ వార్డు కౌన్సిలర్ దుర్గాశంకర్ పండా, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు సురేంద్రనారాయణ త్యాడి, ఏపీవోటీవో జనరల్ సెక్రటరీ బృందావన్ దొలియా, ఒడియా డీఐ దుర్గాప్రసాద్ చౌదిరి, పాఠశాల హెచ్ఎం జనార్దనరావు, సీఆర్పీ ఉర్నాన అప్పలరాజు ఉన్నారు.

వైద్యానికి ఆర్థిక సాయం

వజ్రపుకొత్తూరు రూరల్: పెదమురహరిపురం గ్రామానికి చెందిన భద్రాచలం తారకేశ్వరరావు గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న బైపల్లి గ్రామస్తులు రూ.42,900 సేకరించారు. ఈ మొత్తాన్ని తారకేశ్వరరావుకు మంగళవారం అందజేసి అండగా నిలిచారు. వైద్యం కోసం వినియోగించాలని కోరారు. తెప్పల శాంతారావు, తామాడ శ్రీను, రెయ్యి ఈశ్వరరావు, బి.గణేష్ ఉన్నారు.

వరి పంటను పరిశీలించిన శాస్త్రవేత్తలు

సోంపేట: వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పలాసపురంలో పాడైపోయిన వరి పొలాలను రాగోలు వరి పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ పి.ఉదయ్ కుమార్, ఆమదాలవలస కృషివిజ్ఞాన కేంద్రం అధికారి కె.భాగ్యలక్ష్మి పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంట నష్టం వివరాలు సేకరించారు. ఆలస్యంగా నాట్లు వేసిన వారికి ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణపై సూచనలు అందజేశారు. వ్యవసాయ సహాయకులు జీవిత పాల్గొన్నారు.

కంచిలి: కొల్లూరు, మఠం సరియాపల్లి, బెల్లుపడ గ్రామాల్లోని వరి పైరుకు ఏర్పడిన చీడపీడలను రాగోలు వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తల బృందం మంగళవారం పరిశీలించింది. వరిలో కాండం తొలుచుపురుగు, ఆకుముడత ఎక్కువగా ఉన్నట్లు శాస్త్రవేత్త ఉదయ్‌బాబు గుర్తించారు. వీటి నివారణకు ఎకరాకు కార్టాప్ హైడ్రాక్లోరైడ్ 400 గ్రాములు, కొరజెన్ 60 ఎం.ఎల్. నీటిలో కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు.

జాతీయస్థాయి పోటీలకు క్రీడాకారిణులు

కాశీబుగ్గ: నెల్లూరు జిల్లా ఆత్మకూరులో 67వ స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి పోటీలు జరిగాయి. ఇందులో పాల్గొన్న పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన ఇద్దరు క్రీడాకారిణులు రాణించారు. ప్రియమణి అండర్-19 విభాగంలో బాల్ బ్యాడ్మింటన్ పోటీలో మొదటిస్థానం, జ్యోత్స్న అండర్-19లో ద్వితీయ స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు కాశీబుగ్గ విద్యావాహిణి ప్రిన్సిపాల్ పైల తిరుమలరావు తెలిపారు.

క్రీడాకారులకు అభినందనలు

కాశీబుగ్గ: జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు శ్రీకాకుళం జట్టు తరఫున ఎంపికైన పలాసకు చెందిన ఎం అర్జున్, కె.విజయ్, ఎం.సుమంత్, ఎం విష్ణువర్ధన్‌లు ఎంపికయ్యారు. జమ్మూకశ్మీరులో జరుగుతున్న పోటీలకు హాజరుకానున్న సందర్భంగా వారికి జిల్లా రోల్ బాల్ అసోసియేషన్ సెక్రటరీ, పలాస ప్రభుత్వ హైస్కూల్ ఆంగ్ల ఉపాధ్యాయులు మజ్జి కిరణ్‌కుమార్ అభినందించారు. పలాస మదర్ థెరిసా పాఠశాల ఆవరణంలో ఉన్నటువంటి స్కేటింగ్ కోర్టు వద్ద క్రీడాకారులకు అవసరమైన క్రీడాకిట్లు అందించారు.

రూ. 1.26 లక్షలు పలికిన అమ్మవారి చీర

ఇచ్ఛాపురం: గజలక్ష్మి అమ్మవారి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని ప్రత్యేకంగా ఆలంకరించి పూజలు చేసిన పట్టుచీరను వేలం వేయగా.. రూ. ఒక లక్షా 26 వేలు పలికింది. మున్సిపాలిటీ పరిధి రత్తకన్న గ్రామం నాయుడు వీధిలో నిర్వహించిన గజలక్ష్మి అమ్మవారి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజులు అమ్మవారికి ఆలంకరించిన పట్టు చీరను ఉత్సవ మండపం వద్ద మంగళవారం సాయంత్రం వేలం వేశారు. అదే గ్రామానికి చెందిన దుదిష్టిబిసాయి, ఈశ్వరి దంపతులు రూ. లక్షా 26 వేలకు దక్కించుకున్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి

సోంపేట: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని పలాసపురం సర్పంచ్ తడక జోగారావు అన్నారు. పలాసపురం ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. అవసరమైన విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేశారు. కంటి వైద్యసహాయకులు లక్ష్మణరావు, ప్రధానోపాధ్యాయుడు బల్ల హరికృష్ణ, విద్యాకమిటీ చైర్మన్ బీన కష్టారావు పాల్గొన్నారు.

వాహనాల వేలం

ఇచ్ఛాపురం రూరల్: మండల పరిషత్ కార్యాలయంలో నిరుపయోగంగా ఉన్న జీపు, వాటర్ ట్యాంకులను మంగళవారం వేలం వేశారు. హరిపురం గ్రామానికి చెందిన దక్కత రామారావు రూ. 84 వేలకు దక్కించుకున్నారు. ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు పాల్గొన్నారు.